సాక్షి
ఖమ్మం
బుధవారం । 10 । జూలై । 2024



ఆగస్టులో సాగునీరు

సీతారామ ప్రాజెక్టు ద్వారా ఆగస్టు నాటికి పొలాలకు గోదావరి జలాలు సరఫరా చేస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు. 8లో



సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్..

జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు స్థలసేకరణలో నిమగ్నమయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లా అంతటా బుధవారం వర్షం కురిసే అవకాశముంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురవొచ్చు.

న్యూస్‌రీల్

సదరమ్ సర్టిఫికెట్‌కు 80 మంది అర్హత

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపులో 80 మంది దివ్యాంగులు సర్టిఫికెట్‌కు అర్హత సాధించారు. స్లాట్ బుక్ చేసుకున్న 160 మందిలో 126 మంది హాజరయ్యారు. ఆర్థో, కంటి, మానసిక తదితర విభాగాల్లో పరీక్షించిన వైద్యులు 80 మందిని అర్హులుగా గుర్తించి సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

హైవేపై హైకోర్టులో మరో పిటిషన్

రఘునాథపాలెం: నాగపూర్ – అమరావతి వరకు నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవేపై హైకోర్టు మంగళవారం మరో స్టే విధించిందని పిటిషన్ దాఖలు చేసిన ప్లాట్ల యజమానులు వెల్లడించారు. ఎన్‌హెచ్ 163–జీ పేరుతో నిర్మిస్తున్న హైవేకు సంబంధించి కలెక్టరేట్ వెనకాల పాట్లు ఉన్న 17 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో స్టే విధించిందని మంగళవారం వారు తెలిపారు. వారం క్రితం తీర్థాల నుంచి వి.వెంకటాయపాలెం సెక్షన్‌లో 29 మంది రైతులు, ప్లాట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించగా స్టే వచ్చిన విషయం విదితమే. ఖమ్మం నగరం మధ్య నుంచి వెళ్లేలా హైవే అలైన్‌మెంట్ ఉండడంతో పలువురు నష్టపోతున్నామని చెబుతూ కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఈనేపథ్యాన స్టే విధించిన హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు వారి ప్లాట్లను స్వాధీనం చేసుకోవద్దని ఆదేశించినట్లు తెలిసింది.

మత్స్య పెంపకంలో అధునాతన పద్ధతులు



శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గణేష్

కూసుమంచి: రాష్ట్రాన్ని మత్స్య ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపేలా మత్స్యకారులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ జి.గణేష్ సూచించారు. పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మత్స్యకారులకు ప్రభుత్వ సహకారంతో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఇక్కడ అందిన సలహాలతో చేపల ఉత్పత్తిలో రాణించాలని చెప్పారు. అనంతరం పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, మత్స్య శాస్త్రవేత్త రవీందర్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యం అందించాలి



వైద్యులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ముదిగొండ: ప్రభుత్వాస్పత్రులపై నమ్మకంతో వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాలతి సూచించారు. ముదిగొండలోని పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని సౌకర్యాలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. ఆతర్వాత ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా పరీక్షల కోసం వచ్చినవారితో మాట్లాడారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని వైద్యాధికారి అరుణాదేవికి సూచించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి ఆలయ అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఎలా ఇద్దాం.. ఏం చేద్దాం?!

‘రైతుభరోసా’పై అభిప్రాయ సేకరణ

- ఎన్ని ఎకరాలకు ఇవ్వాలి.. సాగు చేయకున్నా ఇవ్వాలా?
- నేడు ఖమ్మంలో ప్రజాప్రతినిధులు, రైతులతో కీలక సమావేశం
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, ముగ్గురు మంత్రులు
- సీజన్ మొదలవడంతో ఎదురుచూస్తున్న రైతులు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగమైన రైతు భరోసా అమలు విషయంలో విధివిధానాల ఖరారు కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇవ్వగా.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేల చొప్పున అందిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం జిల్లాలో ఎకరానికి రూ.10 వేల చొప్పున 3.42 లక్షల మంది రైతులు రూ.360 కోట్లు అందుకుంటున్నారు. అయితే పథకంలో మార్పులు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయ శాఖ, సహకార సంఘాల ఆధ్వర్యాన అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం ఏర్పాటుచేయగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు రైతు ప్రతినిధులు, సంఘాల నాయకుల అభిప్రాయాలు సేకరించనున్నారు.

ఇప్పటికే పేరు మార్పు

గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. వానాకాలం, యాసంగిలో రూ.5 వేల చొప్పున ఇచ్చింది. ఎన్ని ఎకరాల భూమి ఉన్నా.. సాగు చేసినా, చేయకున్నా పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు ఈ సాయం అందింది. ఈ నేపథ్యాన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పథకం పేరును రైతు భరోసాగా మార్చింది. అలాగే, పెట్టుబడి సాయంగా ఇస్తామని చెప్పిన రూ.15 వేలను గతంలో మాదిరి రెండు విడతల్లోనే ఇస్తుందా, ఒకే విడతలో ఇవ్వనుందా అనేది తేలాల్సి ఉంది.

రైతు వేదికల్లో అభిప్రాయ సేకరణ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రైతు భరోసా అమలులో మార్పులు తీసుకొస్తామని చెబుతున్నారు. ఈనేపథ్యాన ఎన్ని ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలి, భూమి సాగులో ఉన్నా, లేకున్నా జమ చేయాలా, వద్దా అన్న అంశంపై ఇప్పటికే జిల్లాలో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తయింది. జిల్లాలోని 129 రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన, 76 సహకార సంఘాల ఆధ్వర్యంలో మహాజన సభలు నిర్వహించారు. ప్రధానంగా ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలి.. సేద్యం కాని భూముల పరిస్థితి ఏంటనే అంశంపై అభిప్రాయాలు కోరగా ఎక్కువ మంది పదెకరాల వరకు రైతు భరోసా వర్తింపజేయాలని సూచించారు.

‘భరోసా’ కోసం..

వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పెట్టుబడి సాయాన్ని త్వరగా అందించాలని కోరుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల వరి నార్లు పోయగా, పత్తి సాగు ఊపందుకుంది. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుభరోసా కూడా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పుడు సాయం జమ చేస్తేనే సాగుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

నేడు కీలక సమావేశం

జిల్లాలో వ్యవసాయ శాఖ, సహకార సంఘాల ద్వారా అభిప్రాయ సేకరణ పూర్తికావడంతో.. బుధవారం కలెక్టరేట్‌లో కీలక భేటీ ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కానున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిపి 250 మంది పాల్గొననున్నారు. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో రైతుభరోసా అమలు విధివిధానాలపై అభిప్రాయాలు సేకరిస్తారు. ఆర్థిక, రెవెన్యూ, వ్యవసాయ శాఖ మంత్రులు జిల్లాకు చెందిన వారే కావడంతో ఈ సమావేశంలో ఏదైనా ప్రకటన చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ సమావేశంలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది.

‘సీతారామ’ భూసేకరణ పూర్తి చేయండి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ప్రాజెక్టు స్టేజ్– 2 పనుల పురోగతిపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్, ఎన్నెస్పీ లింక్ కెనాల్ పనులు పురోగతిలో ఉన్నందున ఇంకా కావాల్సిన భూమి త్వరగా సేకరించాలని తెలిపారు. 75 శాతం కంటే ఎక్కువ భూమి కోల్పోయి కొద్దిమేర మాత్రమే మిగిలితే అది కూడా తీసుకోవాలని సూచించారు. భూనిర్వాసితులకు గిరి వికాసం తదితర ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయమై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈసమీక్షలో ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, ఇరిగేషన్ ఈఈ అర్జున్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మీనన్, ఏన్కూరు తహసీల్దార్ శేషగిరిరావు, ఉద్యానవన అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ప్రకారం పనులు పూర్తి చేయండి

ప్రభుత్వ ప్రాధాన్యత ప్రకారం పనులు పూర్తిచేయడంపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్య పుస్తకాల పంపిణీ, ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఉద్యోగుల బదిలీలపై సమీక్షించి సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రభుత్వ పథకాల అమలు వివరాలు వెల్లడించారు. ఈసమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు ఎస్.వినోద్, శ్రీనివాస్, హరికిషన్, డాక్టర్ మాలతి, సోమశేఖర శర్మ, విజయలక్ష్మి, వెంకట్రాం, వెంకట్‌రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్, సీఈఓ నిర్ణయాలతో డీసీసీబీకి నష్టాలు

రాష్ట్ర మంత్రి తుమ్మలకు వివరించిన డైరెక్టర్లు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని.. చైర్మన్, సీఈఓ తీసుకుంటున్న నిర్ణయాలు బ్యాంకును నష్టపర్చేలా ఉంటున్నాయని డైరెక్టర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు డైరెక్టర్లు లక్కినేని సురేందర్‌రావు, జనగం కోటేశ్వరరావు, గొర్ల సంజీవరెడ్డి, బోబోలు లక్ష్మణ్ రావు, నిర్మల పుల్లారావు, మోదుగు పుల్లారావు వినతిపత్రం అందించి మాట్లాడారు. చైర్మన్, సీఈఓ నడుమ సమన్వయ లేమితో బ్యాంకుపై రైతులు, ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని తెలిపారు. అంతేకాక డైరెక్టర్ల అభిప్రాయాలకు ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదని చెప్పారు. డైరెక్టర్లతో సంప్రదించకుండా సుమారు రూ.70 లక్షలను అధికారులకు ఇన్సెంటివ్‌గా అందజేశారని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు హెచ్‌ఆర్‌సీ పాలసీని పక్కన పెట్టి ఉద్యోగులను బదిలీ చేయగా పెద్ద ఎత్తున నగదు చేతులు మారిందనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఆడిటర్లను మార్చాలని తీర్మానిస్తే అధికారులకు ఇష్టమైన వారిని నియమించుకుని, మూడు రెట్లు అధికంగా వేతనం ఇచ్చారని చెప్పారు. వానాకాలం సీజన్‌లో రూ.780 కోట్ల పంట రుణాలకు కేవలం రూ.270 కోట్లే ఇచ్చారని తెలిపారు. ఇకనైనా పూర్తిస్థాయిలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను నియమించాలని, ఖాళీగా ఉన్న నాలుగు డైరెక్టర్ల పదవులు భర్తీ చేయాలని కోరారు. కాగా, బుధవారం ఖమ్మం రానున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి సైతం ఈ అంశాన్ని తీసుకెళ్లాలని డైరెక్టర్లు నిర్ణయించినట్లు తెలిసింది.

స్వాహాకార్యంలో మలుపులెన్నో...

- విద్యాశాఖ కాంట్రాక్టు ఉద్యోగి లీలలపై విచారణ
- రూ.61లక్షలు గోల్‌మాల్ చేసినట్లు ప్రాథమిక నిర్ధారణ
- బ్యాంకు సిబ్బంది సహకారంపైనా ఆరా

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలోని సమగ్రశిక్షా భియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగి రామకృష్ణ రూ.1.82 కోట్ల మేర నిధులు స్వాహా చేసిన అంశంపై విచారణలో రోజుకో కొత్త అంశం బయటపడుతోంది. తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయన లీలలు భద్రాద్రి జిల్లాలోనూ వెలుగుచూశాయి. స్కూల్ గ్రాంట్ నిధులు రూ.1.82కోట్లు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తుండగా, విద్యాశాఖ అధికారులు సోమవారం వరకు రూ.26లక్షలు మాత్రమే స్వాహా అయినట్లు వెల్లడించారు. అయితే, రామకృష్ణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని మైనార్టీ గురుకుల పాఠశాలకు సంబంధించి రూ.35లక్షలు సైతం వాడుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ కొంతకాలం విధులు నిర్వర్తించిన నేపథ్యాన రూ.61లక్షలు పోగా మిగతా నిధులు ఎక్కడివనేది తేలాల్సి ఉంది.

బ్యాంక్ సిబ్బంది సహకారం?

ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకు సిబ్బంది కొందరు రామకృష్ణకు సహకరించడంతోనే అవకతవకలకు పాల్పడినట్లు విద్యాశాఖ అధికారులు నిర్ధారించారు. అకౌంట్ తెరిచింది మొదలు నగదు డ్రా చేసే వరకు బ్యాంక్ సిబ్బంది అడుగడుగునా సహకరించినట్లు తెలుస్తోంది. డీఈఓ, ఇతర అధికారుల పేరిట వారి సమాచారం లేకుండా అకౌంట్ తెరవడానికి వీలుండదు. కానీ ఫోర్జరీ సంతకాలతో అకౌంట్ తెరవడంతో పాటు చెక్కుల రూపంలో కాకుండా నేరుగా రామకృష్ణకు నగదు ఇచ్చినట్లు తేలడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. కనీసం అకౌంట్ తెరిచే సమయాన డీఈఓకు సైతం చెప్పలేదని, నేరుగా రూ.12లక్షలు నగదు ఇచ్చినప్పుడు కూడా సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈవ్యవహారంపై బ్యాంక్ సిబ్బందిని సమాచారం అడిగితే చెప్పడం లేదని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇక స్కూళ్ల బాధ్యులు తెరిచే పీపీఏ అకౌంట్ ద్వారా హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్ సంతకం లేకున్నా రామకృష్ణ డ్రా చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై రాష్ట్రస్థాయి సమగ్ర శిక్షాభియాన్ సీనియర్ కన్సల్టెంట్ జి.విజయశంకర్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ వి.బాలజయశంకర్ తదితరులు మంగళవారం రఘునాథపాలెం మండలం బూడిదంపాడు స్కూల్, కారేపల్లి మోడల్ స్కూల్, కెనరా బ్యాంకుతో పాటు డీఈఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ విషయమై డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడుతూ సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగి రామకృష్ణ నిధులు స్వాహా చేసిన అంశంపై కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లామని, ఈ వ్యవహారంలో సహకరించిన వారిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ల బదిలీ

- కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డీఎంలకు పోస్టింగ్
- ఖమ్మం డీఎం హెడ్డాఫీస్‌కు అటాచ్

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతి కల్పించడంతో పాటు పలు డిపోల మేనేజర్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఖమ్మం రీజియన్‌లోని నాలుగు డిపోల మేనేజర్లను బదిలీ చేసిన యాజమాన్యం.. ఆ స్థానాల్లో పదోన్నతి కల్పించిన ఉద్యోగులను డీఎంలుగా కేటాయించింది. ఈ మేరకు ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావును హెడ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించగా.. ఆ స్థానంలో నిజామాబాద్ ఆర్‌ఎం కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) పి.దినేష్‌కుమార్‌ను పదోన్నతిపై నియమించారు. కొత్తగూడెం డిపో మేనేజర్ బీ.వీ.రావును హెడాఫీస్ ఏఎంఈ(ఎలక్ట్రికల్)గా బదిలీ చేయగా.. గద్వాల డిపో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) ఎం.దేవేందర్‌గౌడ్‌ను పదోన్నతిపై కేటాయించారు. ఇక మణుగూరు డీఎం టి.స్వామిని వరంగల్ బస్‌స్టేషన్ ఏటీఎంగా బదిలీ చేసి, హయత్‌నగర్–1 డిపో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్యాంసుందర్‌ను పదోన్నతిపై మణుగూరు డీఎంగా నియమించారు. అలాగే, భద్రాచలం డిపో మేనేజర్ వి.రామారావును కరీంనగర్ జోన్ కార్గో ఏటీఎంగా బదిలీ చేసి, హెడాఫీస్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.తిరుపతిని పదోన్నతిపై భద్రాచలం డీఎంగా కేటాయించారు.

ముంచెత్తిన వరద

వంద ఎకరాల్లో పంటలకు నష్టం

సత్తుపల్లి: భారీ వర్షంతో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో వంద ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లింది. సత్తుపల్లి మండలంలోని పలుచోట్ల మంగళవారం మధ్యాహ్నం ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో వరద పోటెత్తగా బేతుపల్లి రెవెన్యూలోని పాకలగూడెం శివారులో వరి నాట్లు మునిగిపోయాయి. గంగారం గుట్ట మీదుగా చింతంపల్లి వైపు నుంచి వరద రావడంతో రైతులకు నష్టం వాటిల్లింది. పదేళ్ల క్రితం లైలా తుఫాన్ వచ్చిన సమయాన కూడా ఇదే ప్రాంతంలో భారీగా పంటలు దెబ్బ తిన్నాయి. అలాగే, రోడ్డు సైతం కొట్టుకుపోవడంతో కొద్దిమేర ఎత్తుగా రోడ్డు వేయడమే కాక మధ్యలో బ్రిడ్జి నిర్మించారు. మళ్లీ ఇప్పుడు వరద ముంచెత్తగా వరినాట్లు నీట మునగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.



పాకలగూడెంలో పొలాల మీదుగా వెళ్తున్న నీరు

సర్దుకుపోవాల్సిందే..

- సబ్జెక్టు టీచర్ల అడ్జెస్ట్‌మెంట్‌కు కసరత్తు
- ఎక్కువగా ఉన్న చోట నుంచి తాత్కాలికంగా కేటాయింపు
- వేంసూరు, ఎర్రుపాలెం వెళ్లేందుకు ఉపాధ్యాయుల విముఖత ?



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ ఉపాధ్యాయుల పోస్టులను సర్దుబాటు ద్వారా భర్తీ చేసేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. సుమారు 80మంది సబ్జెక్ట్ టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో ప్రధానంగా బయాలజికల్ సైన్స్, హిందీ, సోషల్ సబ్జెక్ట్ పోస్టులు ఉన్నాయి. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

30 పాఠశాలల్లో ఇక్కట్లు

జిల్లాలో 212 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా.. ఇందులో సుమారు 30పాఠశాలల్లో 80మంది సబ్జెక్ట్ టీచర్ల కొరత ఏర్పడింది. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు వివరాలు సేకరించారు. కొన్ని పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు ఇద్దరు, ముగ్గురు ఉండగా.. అసలే లేని చోటకు ఒకరిని పంపించాలనే భావనకు వచ్చారు. తద్వారా నియామకాలు జరిగే వరకు బోధన కుంటుపడదని చెబుతున్నారు. ఈక్రమంలోనే మంగళవారం డీఈఓ సోమశేఖరశర్మ తన కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమై చర్చించారు.

త్వరలోనే పూర్తి చేస్తాం

ప్రధానంగా బయాలజికల్ సైన్స్, హిందీ, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి సుమారు 60పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎక్కువ ఉన్న స్కూళ్ల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తిచేసి బోధనకు ఆటంకం లేకుండా చూస్తాం.
– సోమశేఖరశర్మ, డీఈఓ

ఆ మండలాలకు వెళ్లేది లేదు..

సర్దుబాటుకు కొందరు ఉపాధ్యాయులు సరేనని చెబుతున్నా... వేంసూరు, ఎర్రుపాలెం మండలాల్లో పని చేసేందుకు మాత్రం విముఖత చూపుతున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రమైన ఖమ్మం నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లిరావాలంటే బస్సు, రైలు మార్గాలు సరిగ్గా లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. గతేడాది సైతం ఎస్సెస్సీ పరీక్షల వేళ సుమారు 40మంది టీచర్ల కొరత ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించి సర్దుబాటుకు సిద్ధమైంది. అప్పుడు కూడా వేంసూరు, ఎర్రుపాలెం వెళ్లేందుకు ఎవరూ ముందుకు రాలేదని తెలిసింది. మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఎదురవుతుండడంతో ఏం చేయాలా అనే సందిగ్ధత అధికారుల్లో నెలకొంది.

క్లుప్తంగా

పదోన్నతుల తర్వాతే బదిలీలు?

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు బదిలీల కోసం శాఖల వారీగా కసరత్తు జరుగుతోంది. ఈమేరకు జిల్లాలోని నీటిపారుదల శాఖలో సైతం ఇప్పటికే ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీకి అర్హులైన ఉద్యోగుల జాబితా సిద్ధం చేశారు. కానీ పదోన్నతులు కల్పించాకే బదిలీలు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది. ఈమేరకు అధికారులు బదిలీల జాబితా పక్కన పెట్టి పదోన్నతులకు అవకాశమున్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.

ఇసుక డంప్‌ల సీజ్



ఇసుక నిల్వలకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌ సాయిపేట ఆకేరు పరీవాహక ప్రాంతంలో నిల్వ చేసిన ఇసుకను మైనింగ్, రెవిన్యూ అధికారులు సీజ్ చేశారు. హైదర్‌సాయిపేట, రావిచెట్టుతండా, పడమటితండా ప్రాంతాల్లో ఇసుక నిల్వలను పరిశీలించి వాటికి మార్కింగ్ ఇచ్చారు. ఈ ఇసుకకు రెవెన్యూ అధికారుల అనుమతితో వేలం నిర్వహిస్తామని మైనింగ్ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఉపసర్పంచ్ మృతి



కొండలు (ఫైల్)

బోనకల్: మండలంలోని రావినూతల మాజీ ఉప సర్పంచ్ బోయినపల్లి కొండలు(53) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై కొండలు తన పొలం వద్దకు వెళ్లి వస్తుండగా బోనకల్ వైపు నుండి వైరా వెళ్తున్న ఐజాక్ వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, కొండలుకు భార్య, కుమార్తె ఉండగా, ఐజాక్ వాహన డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు..



వీరన్న (ఫైల్)

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ రైతు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని అజ్మీరతండా గ్రామపంచాయతీ పరిధి రాకాసితండాకు చెందిన రైతుబానోతు వీరన్న(33) ఈనెల 5న కిరాణం సరుకుల కోసం మోటార్ సైకిల్‌పై పిండిప్రోలు వెళ్లి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్లింది. ఈ ఘటనలో వీరన్నకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



రమణయ్య (ఫైల్)

ఏన్కూరు: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని బురదరాఘవాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పినపాక రమణయ్య(65) తన ఇంటి ముందు పత్తి చేనులో కలుపు తీస్తుండగా విద్యుత్ స్తంభం సపోర్ట్ తీగ ఆయన కుడి చేతికి తగిలింది. దీంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బాదావత్ రవికుమార్ పరిశీలించి రమణయ్య కుమారుడు ఉపేందర్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం పరిధి బొంబాయితండాకు చెందిన గుగులోత్ గణేశ్ రెండు రోజులుగా కనిపించడం లేదని ఆయన కుటుంబీకులు మంగళవారం కొమరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం బైక్‌పై వెళ్లిన గణేశ్.. ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు



(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,600	4,000
కందులు	11,000	11,000
అలసంద	7,200	6,500
మిర్చి	17,100	10,000
ఏసీ మిర్చి	19,200	11,000
తాలు మిర్చి	10,100	10,000
పత్తి	7,300	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705

ఆగస్టులో సాగునీరు..

1.50 లక్షల ఎకరాలకు సీతారామ జలాలు

- ఈ నెలాఖరు నాటికి వెట్‌రన్‌కు ఏర్పాట్లు
- రెండు పంప్‌హౌస్‌ల్లో కొనసాగుతున్న పనులు
- పరిశీలనకు రానున్న చైనా ఇంజనీర్ల బృందం
- వీకే రామవరం పంప్‌హౌస్ పరిశీలనలో మంత్రి తుమ్మల



పంప్‌హౌస్‌లో పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన భద్రాద్రి కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే జారె, అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెలాఖరు నాటికి వీకే రామవరం, కమలాపురం పంప్‌హౌస్‌ల్లో వెట్ రన్ నిర్వహించి ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను సాగు అవసరాలకు సరఫరా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ములకలపల్లి మండలం వీకే రామవరం – పూసుగుంట గ్రామాల మధ్యన గల రెండో పంప్‌హౌస్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టులోని రెండు, మూడు పంప్‌హౌస్‌ల్లో చైనాకు చెందిన షాంఘై ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన మోటార్లు ఉపయోగించినట్లు తెలిపారు. త్వరలో చేపట్టబోయే వెట్‌రన్‌కు ముందు ఈ మోటార్ల పనితీరును షాంఘై కంపెని ఇంజనీర్ల సమక్షంలో చెక్ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే వారు ఇండియాకు వచ్చేందుకు వీసా సమస్య ఎదురైందని, దీన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో సంప్రదించామని తుమ్మల వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి తనిఖీలు పూర్తిచేసి వెట్ రన్ చేస్తామన్నారు. అనంతరం ఆగస్టులో సీఎం చేతుల మీదుగా ఏన్కూరు లింక్ కెనాల్ (రాజీవ్ కెనాల్)ను ప్రారంభించి 1.50 లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లు అందిస్తామని ప్రకటించారు. మంత్రి వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఇప్పటికి రూ.7,800 కోట్లు..

సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.7800 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంప్‌హౌస్‌ల్లో మోటార్లు బిగించి మూడేళ్లు దాటితే వాటి పనితీరు దెబ్బ తింటుందని, అందుకే వెట్ రన్ నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. తొలిదశలో ఒక మోటార్ నడిపించడం ద్వారా ఎన్నెస్పీ, వైరా, లంకాసాగర్ రిజర్వాయర్లకు నీరు సరఫరా చేస్తామని అన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, వచ్చే సీజన్‌లో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరందిస్తామనే నమ్మకం ఉందని చెప్పారు. జూలూరుపాడు, పాలేరు (బీరోలు) టన్నెళ్ల నిర్మాణం పూర్తయితే అన్ని మోటార్లు పూర్తి స్థాయిలో నడిపిస్తామని తెలిపారు. జూలూరుపాడు కాల్వ నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీతారామ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే కొత్త, పాత కలిపి నియోజకవర్గానికి లక్ష ఎకరాల చొప్పున సాగు నీరందుతుందని వివరించారు. కృష్ణా నది నుంచి నీరు రాకపోయినా గోదావరి నీటితో సాగర్ ఆయకట్టును ఆదుకోవచ్చని, తాగు, సాగు నీటికి ఇబ్బంది ఉండదని అన్నారు. కొత్తగూడెం – తిరువూరు మార్గంలో చండ్రుగొండ వద్ద సీతారామ ప్రధాన కాల్వపై వంతెన నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థతో చర్చించగా అనుమతులు లభించాయని తెలిపారు. ప్రధాన కాల్వ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైప్ లైన్ అంశంపై గుజరాత్ రాష్ట్రంతో సంప్రదింపులు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సీతారామలో ఇల్లెందు ప్యాకేజీతో పాటు దుమ్ముగూడెం మండలంలో 30 వేల ఎకరాలను నీరందించేలా ప్రగళ్లపాడు లిఫ్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

అన్నపురెడ్డిపల్లి : సీతారామ ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన శివారు జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సీతారామ కాల్వ, బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంతో జిల్లా సస్యశ్యామలంగా మారుతుందన్నారు. కాల్వ నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. మంత్రి వెంట కలెక్టర్ జితేష్ వి పాటిల్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, సీతారామ ప్రాజెక్ట్ సీఈ ఎ.శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ ఎస్. శ్రీనివాసరెడ్డి, ఈఈ అర్జున్, డీఈఈ భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

మొహర్రం సందడి...



కొత్తగూడెంలో పీరీల ఊరేగింపు

పల్లెపట్నం తేడా లేకుండా మొహర్రం సందడి మొదలైంది. ఈ మేరకు ఖమ్మంలోని కొత్తగూడెంతో పాటు రఘునాథపాలెం మండలంలోని చిమ్మపుడిలో ముస్లింలు పీరీల ఊరేగింపు చేపట్టారు. కాగా, ఎప్పటిలాగే హిందువులు సైతం ఊరేగింపులో పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.

– ఖమ్మం అర్బన్ / రఘునాథపాలెం

పోడు రైతు ఆత్మహత్యాయత్నం

భూమి ఆక్రమించారని కానిస్టేబుల్ కుటుంబంపై ఆరోపణలు

రఘునాథపాలెం: ఏళ్లుగా పోడు సాగుచేసుకుంటుండగా.. అటవీశాఖ, పోలీసు అధికారులు తప్పుడు కేసులు బనాయిస్తున్నారని చెబుతూ ఓ రైతు సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రఘునాథపాలెం మండలం రజబ్ అలీనగర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రజబ్ అలీనగర్‌కు చెందిన బోడా ప్రసాద్ – లలిత దంపతులు గ్రామ పరిధిలోని ఏడెకరాలను పదిహేనేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఖమ్మంకు చెందిన కానిస్టేబుల్ లక్ష్మణ్ ఆర్‌ఓఎస్‌ఆర్ పట్టా పాసు పుస్తకం తెచ్చుకుని భూమి తనదేనని చెబుతున్నట్లు ప్రసాద్ కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రసాద్ రఘునాథపాలెం పోలీసులను ఆశ్రయించగా, సీఐ శ్రీహరి ఫారెస్ట్, రెవెన్యూ అధికారులను నివేదిక కోరారు. ఈమేరకు ఫారెస్ట్ అధికారులు రికార్డుల ఆదారంగా కానిస్టేబుల్ కుటుంబానికే పట్టా ఉందని చెప్పినట్లు తెలిసింది. ఈక్రమంలో తరచూ తనను పోలీసుస్టేషన్‌కు పిలిచి ఇబ్బంది పెడుతున్నారని, కానిస్టేబుల్ లక్ష్మణ్ కొందరిని పంపించి పత్తి పంటను నాశనం చేశారని చెబుతూ సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడని ఆయన భార్య లలిత వెల్లడించారు. ఈ అంశంపై సీఐ శ్రీహరిని వివరణ కోరగా భూమికి సంబంధించి అటవీశాఖ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారమే నడుచుకున్నామని చెప్పగా.. ఎఫ్‌ఆర్వో రాధిక మాట్లాడుతూ గతంలో ఎఫ్‌ఆర్సీ కమిటీ తీర్మానం ఆధారంగా కానిస్టేబుల్ లక్ష్మణ్ భార్య లావణ్యకు పాస్‌పుస్తకం ఇప్పించినట్లు తెలిపారు. కాగా, ప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆయన భార్య మంగళవారం ఖమ్మం సీపీ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేసింది.

ఎలాంటి సంబంధం లేదు...

ఖమ్మం మామిళ్లగూడెం: రైతు బోడ ప్రసాద్ ఆత్మహత్యాయత్నం విషయంలో తమకెలాంటి సంబంధం లేదని కానిస్టేబుల్ లక్ష్మణ్ భార్య లావణ్య తల్లి లీలాబాయి వెల్లడించారు. ఖమ్మంలో ఆమె మాట్లాడుతూ లావణ్య ఈ ఏడాది భూమిని ప్రసాద్‌కు కౌలు ఇవ్వకపోవడంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని, ఆయన నుంచి తమకు ప్రాణహానీ ఉన్నందున అధికారులు స్పందించాలని కోరారు.

రూ.7లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీ

సత్తుపల్లి బస్టాండ్‌లో ఘటన

సత్తుపల్లి: సత్తుపల్లి బస్టాండ్‌లో బంగారు ఆభరణాల చోరీ జరిగింది. పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన మామిళ్ల వరలక్ష్మి సోమవారం సత్తుపల్లి ఎస్‌బీఐలో సుమారు రూ.7.84 లక్షల విలువైన 112 గ్రాముల నగలను తాకట్టు నుంచి విడిపించుకొని బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ బస్సు కోసం వేచి చూస్తుండగా మొదట బోర్డు అర్థం కాగా మణుగూరు వెళ్లే బస్సు ఎక్కిన వరలక్ష్మి ఆ వెంటనే దిగి ఖమ్మం వైపు వెళ్లే బస్సు ఎక్కింది. అయితే, ఆ సమయాన చేతిలో ఉన్న సంచిలో బంగారు నగలు పెట్టిన పర్స్ కానరాకపోవడంతో ఎంత వెతికినా ఫలితం కానరాలేదు. దీంతో ఆమె సత్తుపల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. కాగా, బ్యాంక్ నుంచి ఆమె ఆభరణాలు తీసుకొస్తున్నప్పుడే అనుసరించిన వారు చోరీ చేసి ఉంటారని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తరచుగా చోరీలు

సత్తుపల్లి బస్టాండ్‌లో తరచూ చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సు ఎక్కే మహిళల నుంచి రూ.10 లక్షల విలువైన బంగారు నగలు కలిగిన పర్స్ దొంగిలించారు. ఏడాది క్రితం అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వస్తున్న ఓ మహిళా ఉద్యోగి హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన బంగారు నగల పర్స్ చోరీకి గురైంది. ఈ ఘటనల్లో ఇప్పటికీ నిందితులు పట్టుబడలేదు. ఇక బస్సులు రద్దీగా ఉన్నప్పుడు సెల్‌ఫోన్ల చోరీ సర్వసాధారణమై పోయిందని పలువురు వాపోతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా నిందితులు పేట్రేగిపోతున్న నేపథ్యాన పోలీస్ నిఘా మరింత పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామంలో ఆర్నెళ్ల బాలుడు విద్యుదాఘాతానికి గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుండెపుడి గ్రామానికి చెందిన భూక్యా వెంకటేశ్ – సరోజని దంపతుల కుమారుడు సాత్విక్ ఆడుకుంటూ.. నీళ్ల వేడి చేసే హీటర్‌ను తాకాడు. విద్యుదాఘాతంతో తీవ్ర అస్వస్థతకు గురవగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి 108 ద్వారా కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బాలుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



సీజీఆర్ఎఫ్ చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగులు

వేంసూరు: విద్యుత్ వినియోగదారులు పంపిణీ, ఇతర అంశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) లక్ష్యమని చైర్మన్ వేణుగోపాలాచారి తెలిపారు. వేంసూరు మండలం రాయుడుపాలెం సబ్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశాక పరిష్కారం కాకపోతే రాతపూర్వకంగా కానీ, ఆన్‌లైన్‌లో కానీ సీజీఆర్ఎఫ్ దృష్టికి తీసుకురావొచ్చని తెలిపారు. కాగా, ఇక్కడ నిర్వహించిన లోకల్ కోర్టులో ఎలాంటి ఫిర్యాదులు అందకపోగా, ఉద్యోగులు బాగా పనిచేస్తున్నారని వినియోగదారులు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. అనంతరం సీజీఆర్ఎఫ్ చైర్మన్, సభ్యులను ఉద్యోగులు సన్మానించారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు కె.రమేశ్, ఆర్. చరణ్‌దాసు, ఎస్.నరేందర్, సత్తుపల్లి డీఈ రాములు, ఉద్యోగులు శ్రీధర్, యాదగిరి, జొన్నలగడ్డ అనిల్‌కుమార్, అంకురావు, శరత్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ముదిగొండ: మండలంలోని పెద్దమండవలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇసుకను పెద్ద మండవలోని రోడ్డు పక్కన డంప్ చేయించినట్లు తెలిపారు. కాగా, తనిఖీల్లో ఆర్ఐ ఉషారాణి, సర్వేయర్ ఉమామహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త, అత్త అరెస్ట్

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లికి చెందిన షేక్ జుబేరియా(21) ఆత్మహత్య కేసులో మంగళవారం ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఖమ్మం రూరల్ ఎస్సై రామారావు తెలిపారు. ఆమె ఈనెల 7న బలవన్మరణానికి పాల్పడగా జుబేరియా భర్త షేక్ నజీర్, అత్త బేగంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో భూవివాదం విషయమై ముగ్గురిపై కేసు నమోదైంది. గ్రామంలోని దేవరగట్ల విష్ణుమూర్తి వెంచర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన అదే గ్రామానికి చెందిన దగ్గుబాటి రమాదేవి, వెంకటేశ్వర్లు, శిరోమణి ట్రాక్టర్‌తో దున్నడమే కాక అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించారు. దీంతో విష్ణుమూర్తి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామారావు తెలిపారు.

ఉద్యోగం పేరుతో డబ్బు వసూలు చేశాడని ఫిర్యాదు

నేలకొండపల్లి: ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బు తీసుకుని వ్యక్తి మోసం చేశాడంటూ బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని ముజ్జుగూడెంకు చెందిన ఓ నిరుద్యోగికి సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికాడు. దీంతో ముజ్జుగూడెం వాసి రూ.3 లక్షల మేర ఇవ్వగా ఆ తర్వాత ఫలితం కానరాలేదు. దీంతో మంగళవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్లు

- జిల్లాలో 125 చోట్ల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రభుత్వ స్థలాల కోసం అధికారుల అన్వేషణ
- తహసీల్దార్లకు దరఖాస్తు చేస్తున్న ఏఈలు



నేలకొండపల్లి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతీ సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పీఎం కుశం పథకం క్రింద వీటిని ఏర్పాటుచేస్తారు. ఈమేరకు జిల్లావ్యాప్తంగా 45 సెక్షన్లలోని 125 సబ్‌స్టేషన్ పరిధిలో ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు మొదలుపెట్టారు.

సబ్‌స్టేషన్‌కు 4 కి.మీ. పరిధిలో...

సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సంస్థ ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టింది. జిల్లాలోని125 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వీటి ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను అన్వేసిస్తున్నారు. కనీసం మూడెకరాల నుంచి నాలుగెకరాల స్థలం కావాలని మంగళవారం విద్యుత్ సంస్థ అధికారులు తహసీల్దార్లకు దరఖాస్తు చేశారు. సబ్‌స్టేషన్‌కు 4కి.మీ. పరిధిలో స్థలం కేటాయించాలని అందులో కోరారు. స్థలసేకరణ పూర్తయ్యాక రెడ్‌కోకు అప్పగిస్తే ప్లాంట్ ఏర్పాటుచేసి ఒక్కోచోట కనీసం ఒక మెగా వాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలనేది లక్ష్యంగా తెలుస్తోంది.

ఇదీ ఉద్దేశం

థర్మల్ పవర్ ప్లాంట్ల ద్వారా కాలుష్య ప్రభావం ఉండడంతో కేంద్రప్రభుత్వం కాలుష్య రహితమైన సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. ఇందు కోసం పీఎం కుశం పథకాన్ని తీసుకొచ్చింది. దీనిద్వారా విద్యుత్ సబ్‌స్టేషన్ల సమీపాన ప్లాంట్లను ఏర్పాటుచేసి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తీసుకుని సరఫరా చేస్తారు. ఒక్కో ప్లాంట్ ద్వారా ఒక మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవకాశముందని చెబుతున్నారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి చెన్నారంలో ఇప్పటికే ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేశారు. కాగా, విద్యుత్ శాఖ అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు సైతం రెవెన్యూ అధికారులను కలిసి స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు. ఈనేపథ్యాన మంగళవారం నాయకులు మంకెన వెంకటేశ్వరరావు, భద్రయ్య, మానుకొండ వెంకటేశ్వరరావు, సుల్తాన్ వీరబాబు తదితరులు తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు.

ప్రభుత్వ స్థలాలు మాత్రమే...



జిల్లా వ్యాప్తంగా సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాట్లకు ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని సూచించాం. ఇందు కోసం ఏఈలు తహసీల్దార్లకు దరఖాస్తు చేస్తున్నారు. జిల్లాలోని 125 సబ్‌స్టేషన్ పరిధిలో స్థలాలు గుర్తించి రెడ్‌కో వారికి అప్పగిస్తే వారి ఆధ్వర్యంలో ప్లాంట్లు ఏర్పాటుచేరు.

– సురేందర్, ఎస్‌ఈ, టీజీ ఎన్పీడీసీఎల్

మాలలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలి

బుద్ధవనం ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య



మాట్లాడుతున్న మల్లేపల్లి లక్ష్మయ్య

ఖమ్మంమామిళ్లగూడెం: మాలలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని సామాజిక విశ్లేషకులు, బుద్ధవనం ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. ఖమ్మంలో మంగళవారం యూనిటీ ఆఫ్ మాల జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన తృతీయ వార్షికోత్సవ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అందరు కలిసి పోరాడితేనే హక్కులు సాధించుకోవచ్చని అంబేడ్కర్ చెప్పారని గుర్తుచేశారు. కాగా, అశ్వారావుపేట ఎస్‌ఐ ఆత్మహత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ మాట్లాడుతూ దళితుల కోసం ప్రభుత్వాలు ఏమి చేయాల్సిన అవసరం లేదని, రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేస్తే సరిపోతుందని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, వైద్యులు జగదీశ్, స్వర్ణకుమారి, బాబు రత్నాకర్, నాయకులు మధు, కోటేశ్వరరావు, ఎల్లయ్య, కనకయ్య, శౌరి, బాబూరావు, రత్నాకర్, అశోక్, మధు, రవి, పిల్లి విజయపాల్, కృష్ణ పాల్గొన్నారు.

గ్రూప్–1 మెయిన్స్‌కు ఎంపికైన డీటీలు



ఎ.శివకుమార్, డీటీ

సత్తుపల్లిటౌన్: విధినిర్వహణలో ఒత్తిడితో పాటు వరుస ఎన్నికలు వచ్చినా లక్ష్యాన్ని మరువకుండా సిద్ధమైన రెవెన్యూ ఉద్యోగులు గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు ఎంపికయ్యారు. సత్తుపల్లి తహసీల్‌లో డీటీలుగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.శివకుమార్, జి.సుధీర్ సోమవారం విడుదలైన గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఈసందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 2012 నుంచి గ్రూప్–1 సాధించాలనే పట్టుదలతో సిద్ధమవుతుండగా, 2015లో గ్రూప్–2 వచ్చిందని తెలిపారు. డీటీగా భూపాలపల్లి, నిర్మల్‌లో పనిచేసి సత్తుపల్లికి రాగా, ఈసారి ఎలాగైనా గ్రూప్–1 సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. కోచింగ్ లేకుండానే చదివిన తాను ప్రిలిమ్స్‌లో అర్హత సాధించగా, మెయిన్స్‌కు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు.

'ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం'

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రప్రభుత్వం ప్రజలను మోం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆరోపించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలను లేనిపోని ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు నెలలు దాటినా హామీలు నెరవేర్చలేదన్నారు. ఎస్సీ మోర్చా నాయకుడు సన్నె ఉదయప్రతాప్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యాన పార్టీ నాయకులు హాస్టళ్లను సందర్శించి సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. ఈసమావేశంలో నాయకులు విజయరాజు, చింతమల్ల వీరస్వామి, రీగన్ ప్రతాప్, కోటేశ్వరావు, శ్రీకృష్ణ, సికిందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సంజీవరావు, మధు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తితో భార్య గొడవ పడి పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని బాజుమల్లాయిగూడెంకు చెందిన సిరికొండ ప్రసాద్(40) మద్యానికి బానిసై పనికి వెళ్లకపోవడంతో భార్య లక్ష్మి భర్తను మందలించింది. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ భార్యతో గొడవ పడగా ఆమె పిల్లలను తీసుకుని ఈనెల 8న పుట్టింటికి వెళ్లిపోయింది. ఈమేరకు మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో మద్యం తాగి ఆ మత్తులో పురుగుమందు తాగి విషయాన్ని స్థానికులకు చెప్పాడు. దీంతో స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ప్రసాద్ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.